# పరిమళించిన జీవితం

-పంజాల జగన్నాథం

మనుష్య ప్రపంచం...మానవ సమాజం.... మగ సమాజం....! తరాలు మారినా మగ ప్రపంచంలో మార్పు అంతంత మాత్రమే. మోసం, వంచన, నమ్మక ద్రోహం కొందరి మగవాళ్ల రక్తనాళాల్లో జీర్ణించి ఉంటుందేమో!.... నమ్మకంగా మోసం చేస్తూ జీవితాలతో ఆడుకుంటుంటారు.

నయవంచకుల్ని, అత్యాచారాలు చేసిన వాళ్లని ధైర్యంగా ప్రతిఘటించి, వాళ్ళని కోర్టు కీడ్చి న్యాయం కోసం పోరాడరు. శిక్ష పడేట్టు చూడరు. అంతా తలరాత అనుకుంటూ సర్దుకుపోతున్నారు. అలాంటి ధ్వంసమైన జీవితాల్లో మా అక్క కూతురు ఒకరు.

ఆ రోజు మా బాబు పుట్టిన రోజు. బర్త్‌డే ఫంక్షన్‌కు అక్కయ్య వాళ్లను పిలవడానికి వాళ్లింటికి వెళ్లాను. సమయం పగలు ఒంటి గంటవుతోంది. వాతావరణం ఉక్కగా ఉంది. అక్కయ్య కూతురు సుమిత్రకు తొలి కాన్పు. నర్సింగ్ హోంలో పురుడు పోసుకుని వారం రోజుల క్రితం అక్కయ్య ఇంటికి తీసుకొచ్చింది. తొమ్మిదో రోజు సుమిత్రకు తలంటు స్నానం చేయించారు. పొత్తిళ్లలోని పాపను చూసి సుమిత్రను పలకరించాను. ఏదో చెప్పింది. మాటలు తడబడుతున్నాయి. స్పష్టత లేని కారణంగా నాకేమీ బోధ పడలేదు. వేన్నీటి స్నానం చేయించారు. మత్తుగా నిద్రొస్తుందని' అనుకున్నాను. పక్కలోని పాపకు ఆకలైనట్టుంది గుక్క పట్టి ఏడుస్తోంది.

'సుమిత్రా' బిగ్గరగా పిలుస్తూ అక్కయ్య సుమిత్రను కదిపింది. ఆవిడను లేపి పాపకు పాలు పట్టమని పురమాయించింది. మత్తు కళ్ళతో సుమిత్ర ఏదో గొణిగింది. స్వరం నూతిలో నుంచి వచ్చినట్టుగా ఉంది. నోటి నుండి సన్నగా చొంగ కారుతోంది.

"ఏమయిందే సుమిత్రా!" ఛాతంతా బాదుకుంటూ గట్టిగా తట్టింది ఆదుర్దాతో వాళ్ళ నాయనమ్మ.

"ఏం లేదే సర్ది కొరకు బావ రెండు టాబ్లెట్లు ఇస్తే వేసుకున్నాను" గొణిగింది సుమిత్ర.

"అనుకుంటున్న.. వాడేమో గోలీలిచ్చిండట. నా బిడ్డనేమో చేసిండు. కొంప ముంచిండు. లేకపోతే దీనికెందుకింత మొద్దు నిద్దర. నా బిడ్డ హోష్‌లు లేదు. కాపాడుండ్రీ నా బిడ్డను అంటూ దండంబెడుతూ లబోదిబమని శోకాలు తీయసాగింది ముసలమ్మ.

సుమిత్ర ముఖ వర్చస్సు తేజస్సును కోల్పోసాగింది. అప్పుడు నా కనిపించింది. ఇలాంటి సమయాల్లో ఆప్తులో, స్నేహితులో ఎవరో ఒకరు తోడు లేందే ఏ పనీ చేయలేమని... అక్కయ్య కళ్ళల్లో అంతర్లీనంగా ఎంతో ఆవేదన మసక, మసకగా కనబడుతోంది. గుడ్లలో నీళ్లు తిరుగుతున్నాయి. బావ ఊళ్లో లేడు. ఆయనకు సమాచారం అందించే ప్రయత్నం చేశాను. అక్కయ్య నా వైపు దిగాలుగా చూసింది. ఆమె కళ్ల నుండి నీళ్ళు 'టపటప' రాలుతున్నాయి.

అక్కయ్యకు తన జీవితంలో ఎన్నో మానని మానసిక గాయాలు ఉన్నాయి. ఇప్పటి వరకు తన బతుకంతా ఒడుదుడుకులతోనే గడిచింది. కంటికి మంటికి ఏక ధారగా ఏడ్చి, ఏడ్చి ఆరని కంటి చారలతో తన జీవితాన్ని వెళ్ల దీస్తోంది. అక్కయ్య తన ఒక్కగానొక్క కూతుర్ని ఆర్థిక ఇబ్బందుల్ని సైతం లక్ష్య పెట్టక కడుపు కట్టుకుని ఎంతో గారాబంగా పెంచుకుంది. 'తన కూతురికి ఏమయిందోనని' అక్కయ్య గుండెలు విలవిల్లాడుతున్నాయి. అక్కయ్య విషాద వదనం నా గుండెను పిండేస్తోంది. ముసలమ్మ ఏడుపులతో నాకేమీ పాలు పోవడం లేదు.

"ఊర్కో అత్తయ్యా! ఇప్పుడు చేయాల్సింది ఏడుపులు పెడబొబ్బలు కాదు. సుమిత్రను వెంటనే హాస్పిటల్‌కు తీసుకెళ్లాలి" కొంచెం కటువుగానే మందలించాను. సుమిత్ర పరిస్థితి ' క్షణక్షణం విషమిస్తోంది.

"ఒరే చంద్రం. సుమిత్ర ఎట్లనో చేస్తోందిరా. జల్ది దవాఖానాకు తీసుక బోవాలె". బతిమాలుతూ



అక్కయ్య నాతో అంది. సుమిత్ర కేమయిందో ఎవరికీ అర్థం కావడం లేదు. ఇరుగు పొరుగు వాళ్ల సహాయంతో సుమిత్రను 'ఆటో'లో హాస్పిటల్‌కు తీసుకెళ్లాను. విషయమంతా డాక్టర్‌కు క్లుప్తంగా వివరించాను.

"అయ్యా! నా బిడ్డను కాపాడుండ్రి" అంటూ దీనంగా చేతులు జోడించి అక్కయ్య డాక్టర్ని అర్థించింది.

"అలాగేనమ్మా! నా శాయశక్తులా ప్రయత్నిస్తాను. దిగులు పడకమ్మా!" అంటూ

ధైర్యం చెప్పి పేషంటుకు అవసరమైన అన్ని పరీక్షలు చేసి తక్షణమే డాక్టర్ ట్రీట్‌మెంట్ మొదలెట్టాడు.

హాస్పిటల్ అంతా సందడిగా వుంది. ఫినైల్ వాసన ముక్కు పుటాలకు రప్పున కొడుతోంది. సిస్టర్లు హడావిడిగా అటూ, ఇటూ తిరుగుతున్నారు. సుమిత్ర బెడ్ మీద పడుకుని ఉంది. సుమిత్రకు ఓ నర్స్ గ్లూకోజ్ ఎక్కిస్తోంది. డాక్టర్ సూచన మేరకు ఓ సిస్టర్ ఇంజక్షన్ చేసింది. డాక్టర్ కేసు షీట్‌ను పరిశీలిస్తున్నాడు. సుమిత్ర మూసిన కన్ను తెరవడం లేదు. అక్కయ్య ముఖంలో ఆందోళన కనబడుతోంది. వాతావరణమంతా భారంగా అనిపిస్తోంది. అడుగుల శబ్దం, పరికరాల చప్పుడు తప్ప అక్కడంతా గంభీరంగా ఉంది.

సుమిత్ర చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతోంది. డాక్టరు రాసిచ్చిన మందులు తెచ్చి ఇచ్చాను. కాలం ఎంత విలువయిందో నాకప్పుడు తెలిసింది. క్షణాలు అతి భయంకరంగా దొర్లిపోతున్నాయి. నా గుండెల్లో ఏదో గుబులు మొదలయింది. సుమిత్రకు వామిటింగ్, యురిన్ డిస్‌చార్జ్ చేయించారు. సెలైన్ ఇంజక్షన్లు ఇస్తూనే ఉన్నారు. ఓ ఎనిమిది గంటల నిరంతర పోరాటంతో పేషంట్‌ని మామూలు స్థితికి తీసుకురాగలిగాడు డాక్టర్. పేషంట్‌కు ప్రమాద స్థితి తప్పిందని, ఆమె నెవరూ డిస్టర్బ్ చేయొద్దనీ పేషంట్ తాలూకు బంధువులను హెచ్చరించి డాక్టర్ వెళ్లిపోయాడు. కొద్ది సేపటి తర్వాత అక్కా, బావా నెమ్మదిగా సుమిత్ర బెడ్ దగ్గరకు వెళ్లారు. సుమిత్ర మెల్లగా కళ్లు తెరిచింది. ఆమె కళ్ల నుండి జలజల నీళ్లు కారుతున్నాయి. ప్రస్తుతం సుమిత్ర మృత్యుకుహరం నుండి బయట పడిన విజేత.

చల్లగాలి రివ్వు, రివ్వున వీస్తోంది. హాస్పిటల్ బయట రోడ్ల మీద జనం పలుచ బడ్డారు. పక్కనే ఉన్న పొలాల నుండి కీచురాళ్ళ రొద. నక్షత్ర వీధుల్లో పరుగులు తీస్తోన్న వెండి ముద్దల్లాంటి తెల్లని మబ్బుల కేసి ఎంత సేపు చూశానో నాకే తెలియదు. చీకటి వద్దది. మనస్సు ఏదో ఆలోచిస్తోంది. పట్టణం సగం నిద్రబోయింది. సగం నిశ్శబ్దంతో పోరాడుతోంది. ఆలోచనల్లో ఉన్న మనస్సుకు గడుస్తున్న కాలం సంగతి తెలియడం లేదు.... పరిసరాల్లో తెల్లారుతున్న ఛాయలు కనబడుతున్నాయి. "సార్ బిల్లు" కాంపౌండర్ కేకతో ఆలోచనలు తెగిపోయాయి. బిల్లు చెల్లించి సుమిత్రను ఇంటికి తీసుకెళ్లాం.

✡✡✡

మేనరికపు సంబంధమని చిన్న వయస్సులోనే సుమిత్రకు పెళ్లి చేశాడు బావ. అప్పుడు సుమిత్ర ఎస్.ఎస్.సి చదువుతోంది. బిడ్డనీ, అల్లుణ్ణీ ఇంట్లోనే పెట్టుకున్నారు. పెళ్లైన నాటి నుండి వాళ్లు సఖ్యతగా కాపురం చేసిన దాఖలాలేమీ లేవు. ఆ జంట అన్యోన్యంగా ఉన్నట్లు ఎప్పుడూ అగుపడలేదు. చీటికి మాటికీ వాళ్ల మధ్యన ఏదో గొడవ జరుగుతూనే ఉండేది. మేనరికపు సంబంధం. బావకు అక్క కొడుకు. బావ ఇంట్లోనే పెరిగాడు. ఆ పిల్లాడికే తన కూతురునిచ్చి పెళ్లి చేస్తే సుఖ పడుతుందని అక్కా బావ ఆశపడ్డారు. కన్న తల్లిలా చూసుకున్న అక్కయ్యకు తన అల్లుడి పరిస్థితేమిటో బోధపడలేదు. అతనిదో చిత్రమైన మనస్తత్వం, ఎక్కువగా మాట్లాడడు. ఎటు పోతున్నాడో, ఏం చేస్తున్నాడో, ఇంట్లో ఎవ్వరికీ తెలియదు. అతన్ని చూస్తే నమ్మకంగా గుండెలు తీసే బంటులా అనిపించాడు.

'ముగ్ధమోహన రూపం' అంటూ వర్ణించలేం కాని ముద్దబంతి పూవులా ఉండే సుమిత్రపై 'విషప్రయోగానికి కారణం ఏమిటా!?' అన్న ప్రశ్న మెదడ్ని తొలుస్తోంది. ఎన్నో సందేహాలు బుర్రలో గిర్రున తిరుగుతున్నాయి. ఏమైనా 'క్లూ' దొరుకుతుందేమోనని సుమిత్ర భర్త వెంకట్ సూట్‌కేసును వెదికాను. అందులో ఓ చిన్న పార్శిల్ దొరికింది. అదో ఉత్తరాల కట్ట. వెంకట్‌కు రాసినవి. ఒక్కొక్క ఉత్తరం చదవసాగాను. అక్షరాల వెంబడి కళ్లు పరుగెత్తసాగాయి. ఓ ఉత్తరంలోని కొన్ని వాక్యాలు నా దృష్టిని నిలిపి వేశాయి. అందులోని కొన్ని పదాలు నా కళ్లను కట్టి పడేశాయి. 'అడ్డు తొలగిస్తే మనం జీవితాన్ని హాయిగా అనుభవించొచ్చు' అన్న వాక్యం నన్ను వెంటాడింది. దానికి అర్థాన్ని నా మనస్సు వెదుకుతోంది. భయాందోళనలతో నా భృకుటి

ముడిపడింది.

సుమిత్ర మంచం మీద పడుకుని ఉంది. ఆమె చెక్కిళ్లపై కన్నీటి చారల తడి ఇంకా ఆరలేదు. సుందరమయంగా ఉంటుందనుకున్న సుమిత్ర జీవితం... కాన్వాస్ మీద కనుమిందు చేసే చిత్రం మీద కుంచెల్ని కడిగిన నీళ్ళను గుమ్మరించినట్లయింది. ఆమె జీవితమే ఒక ప్రశ్నగా మారింది. మాతృహృదయం పాప కోసం తల్లడిల్లుతోంది. కళ్లు వెదుకుతున్నాయి. పక్కలో పాపను పడుకోబెట్టాను. కొద్ది సేపట్లోనే సుమిత్ర గురక పెడుతూ నిద్ర పోసాగింది. మానసికంగా అలసి పోయిన అందరికీ కునుకు పట్టింది. పూర్తిగా తెల్లారింది. పొద్దు పొడిచింది. అక్కయ్య సుమిత్రకు ముఖం కడిగించి 'టీ' తాగించింది. పాపకు పాలు పట్టింది. సుమిత్ర కొద్దిగా తేరుకుంది. సుమిత్ర 'బావే' తన సర్వస్వం అనుకుంది. నమ్మింది. మోసగించబడ్డది. తన జీవితంలో చిమ్మని చీకట్లు ముసురుకున్నాయి. ఆలోచనలతో పోరాడుతోంది. రెండేళ్ల వేదన భగ్న చిత్రంలా, ఉద్విగ్న హృదయంలా వెలుగు నీడల మధ్యన కొట్టుమిట్టాడుతోంది. హత్యానేరం కింద 'బావ' పై కేసు పెట్టడానికి మొదట సుమిత్ర ససేమిరా ఒప్పుకోలేదు. కాని బావ పరస్త్రీ వ్యామోహంలో పడి తనని ఎలా మోసం చేసిందీ, తన జీవితాన్ని అంతం చేయడానికి ఎలా పూనుకున్నదీ వివరించాక గాని అంగీకరించలేదు.

పరిస్థితుల్ని గమనిస్తే నా కనిపించిందీ కొన్ని సందర్భాల్లో స్త్రీకి స్త్రీయే పరమ శత్రువవుతుందనీ. 'ప్రతి మనిషిలో రెండో మనిషి ఉంటాడనిపిస్తోంది. ఆ రెండో మనిషి కొందరిలో ఎదుటి వ్యక్తుల అంచనాలకు అందని రీతిలో ఉంటాడేమో!' అలాంటి కోవకు చెందినవాడే వెంకట్. రోజులు దొర్లిపోతున్నాయి. ఓ రోజు అక్కయ్య ఇంటికి వెళ్లాను. సుమిత్ర అదోలా ఉంది. కళ్లల్లో నీళ్ళు. భారమైన గుండెలతో ఏదో ఆలోచిస్తున్నట్టుంది. ఆమె పట్ల జాలి కలిగింది. ఎవరయినా సరే! విపత్కర పరిస్థితుల్లో చిక్కుకుంటే జాలి పడటం సహజం. జాలికి చట్టాలు, ధర్మాలూ గట్రా ఏమీ తెలియవు. అదో విధమైన అసంకల్పిత చర్య, ఎప్పుడూ ఆనందంగా, హడావిడిగా తిరిగే మనిషిని చెరపట్టి మన కళ్ళ ముందు నుంచి మటుమాయం చేయడానికి ప్రయత్నిస్తే.... సహజంగానే.... ఆ మనిషి మీద జాలి కలుగుతుంది. దూకుతూ ఉన్న ప్రవాహం అకస్మాత్తుగా స్తంభించినట్లు, కాలచక్రం ఆగిపోయినట్టు.... సుమిత్ర జీవితం అర్థాంతరంగా అడవి కాచిన వెన్నెలయింది.

"ఏం లేదు మామయ్యా! అమ్మా, నాన్నల పంచన పెరిగాను. వాళ్ల అనురాగానికి కొదువ లేదు. రెండు పదులు కూడా నిండని నా జీవితం ఇట్లా మోడు బారింది. పెళ్లి అయ్యి కాని సమానమే అయ్యింది. నా బతుక్కి ప్రేమగా చూసుకుంటాడనుకున్న బావ మోసగించాడు. అభిమానంగా చూసుకునే అత్తింటి వాళ్లు లేరు. ఒడ్డున పడ్డ చేప జీవం కోసం పెనుగులాడినట్టు! ఇవ్వాళ వ్యక్తిగత జీవితం కోసం జీవించడం ఓ సమస్యగా మారింది. మామయ్యా! కాలం గాయాల్ని మాన్పుతుంది కావచ్చు కానీ, జ్ఞాపకాలు మనస్సుకు కల్గిన గాయాల్ని కెలుకుతున్నాయి..." నిర్వేదంగా మాట్లాడింది సుమిత్ర.

సుమిత్రను ఇంకా పసిపిల్లనే అనుకున్నాను. కాని ఆమె మాటలు విని చాలా ఆశ్చర్యపోయాను.

## బిగ్ పిక్చర్

ఆ ఆకాశపు నీలం
ఆ మబ్బు కొంగల రెక్కల కొనల్నించి
జారిపడే వెలుగు తెలుపూ
ఆ నున్నటి మొజాయిక్ నీళ్ళ నునుపూ
ఆ తడి ఇసిక జిగజిగా,
ఆ సంద్రపు వొడ్డున
బొంగరాల్లా తిరుగుతో
బొటన వేలిత మనం గీసిన గీతలు
అప్పుడు మనం
సర్కిల్స్‌లో వున్నాం–
అందుకే ఆ రంగులకా చిక్కదనం
ఇప్పుడూ... అదే చిత్రం
ఎంత తరచి చూసినా
వెలసిపోయిన రంగులతో...

–పావనీ సుధాకర్

ఎంతో అనుభవం వున్న దానిలా మాట్లాడింది. "సుమిత్రా! జరిగినదంతా ఒక కలలా మరిచి పోవాలమ్మా! మన ఆలోచనలే మన జీవితాన్ని తీర్చిదిద్దుతాయి. జీవితంలో ఏదైనా సాధించాలనుకున్నప్పుడు బలీయమైన ఆశ, మొక్కవోని ధైర్యం రెండూ ఉండాలమ్మా, అలాగే డబ్బూ, కాలమూ ఈ రెండు కూడా జీవితానికి చాలా ముఖ్యమైనవి. ముందు కుంటుబడ్డ చదువు కొనసాగించు. ఉద్యోగం కోసం ప్రయత్నించు. మహిళలకు ఎన్నో అవకాశాలున్నాయి. ఈ రోజుల్లో మహిళలు ఎన్నో రంగాల్లో రాణిస్తున్నారు." నిరాశ, నిస్పృహలతో మగ్గిపోతున్న సుమిత్ర గుండెల్లో ప్రాణవాయువును నింపి జీవితాన్ని, అందులోని ఒడిదుడుకుల్ని ధైర్యంగా ఎదుర్కోడానికి కావలసిన ఆత్మ స్థైర్యాన్ని అందించే ప్రయత్నం చేశాను.

సుమిత్ర తపస్వినిలా కళ్లు పైకెత్తి చూసింది. ఆ కళ్లలో ఎన్నో భావతంత్రులు అగుపించాయి. ఆమె ముఖంలో ఏదో తెలియని చైతన్య రేఖ కనబడింది.

కాలం గిర్రున తిరిగింది. సంవత్సరాలు గడిచాయి...! ఇప్పుడు సుమిత్ర మునుపటి సుమిత్ర కాదు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్శిటీ నుండి ఎం.ఏ. పాసయింది. కంప్యూటర్ నేర్చుకుంది. ఓ ప్రయివేటు కంపెనీలో జాబ్ చేస్తోంది. మంచి స్థాయిలో ఉంది. తన సంరక్షణలో పాపను మంచి స్కూల్లో చదివిస్తోంది. ఆర్థిక స్వావలంబనం, స్వయం పోషకత్వం ఏర్పరచుకుంది. తనపై తనకు ఆత్మవిశ్వాసం పెరిగింది.

సుమిత్రకు తను పని చేసే కంపెనీలో చైతన్య అనే యువకునితో పరిచయం ఏర్పడింది. అతను సుమిత్ర కొలీగ్. సంస్కారం, విశాలభావాలు గల చైతన్య సుమిత్ర కెంతో నచ్చాడు. సుమిత్ర చైతన్యకు దగ్గరయింది.... పశ్చిమాద్రిన దినకరుడు తన దిన చర్యలో భాగంగా దొర్లుకుంటూ వెళుతున్నాడు. గార్డెన్‌లో సుమిత్ర సిమెంటు బెంచీపై కూర్చుని ఎటో చూస్తూ, ఏదో ఆలోచిస్తోంది. పసిమిఛాయ. ఆమె మేను సాయంకాలపు నీరెండలో మెరుస్తోంది. లేత పసిడికాంతుల్లో తళతళ మెరుస్తోన్న వెండి మబ్బులు ఆకాశ వీధిలో మెల్లగా కదిలి పోతున్నాయి. సుమిత్ర వాటినే తదేకంగా చూస్తోంది.

"ఏమండీ సుమిత్ర గారు ఏ లోకంలో ఉన్నారు?" పలకరించాడు చైతన్య. ఉలిక్కి పడింది సుమిత్ర. ఆలోచనలు చెదిరిపోయాయి.

"అబ్బే ఏం లేదండీ" తడబడుతూ జవాబు చెప్పింది.

"అది సరే గానీ నా నిర్ణయానికి మీరే సమాధానమూ చెప్పలేదు"

"ఆలోచిస్తున్నానండీ! నా విషయం పూర్తిగా తెలిసే మీరీ నిర్ణయానికొచ్చారా? నాకో పాప ఉన్న సంగతి మర్చిపోకండి.

"అన్నీ తెలిసే నిర్ణయించుకున్నాను. పాప గురించే కదా మీ బెంగ. ఇక నుంచి పాప మన పాప. నా కన్న కూతురిలా చూసుకుంటాను. మనకు పిల్లలు పుడితే పావను అశ్రద్ధ చేస్తానేమోనన్న భయం ఇక నీకుండదు. అలాంటి మీమాంస ఉండకూడదనే నిన్ననే ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేయించుకున్నాను. ఇప్పుడు మీకెలాంటి సందేహాలు లేవనుకుంటాను. ఇకనైనా మన పెళ్లికి అంగీకరిస్తారా సుమిత్ర గారూ?"

సుమిత్ర చేప రెక్కల్ని అల్లల్లాడించినట్టు కనురెప్పల్ని కదిలిస్తూ.... ఆర్ద్రమైన గుండెలతో, కళ్ల నిండా ఆనంద బాష్పాలతో చైతన్య రెండు చేతుల్ని పట్టుకుంది. మనస్సుల్లోనే అతని హృదయ సంస్కారానికి జోహార్లు అర్పించింది. మమకారం కురిపించే మనస్సు పొరల్ని కాగితాలుగా పరిచి, ప్రేమాభిమానాలు నిండిన హృదయాన్ని తన కర్పించిన చైతన్య ఔన్నత్యానికి దాసోహమంది.

కులమతాల ఎల్లలు దాటి జీవితం పరిమళిస్తున్న కాలమిది. వివాహానికి కులం, వర్గం, వర్ణం, వర్చస్సు, వరకట్నం ఇవేమీ కాక ప్రేమ, ఆత్మీయత చదువూ, సంస్కారం బ్రతుకుదెరువు లాంటివి అర్హతలుగా, పెళ్లిళ్లు జరగాల్సిన రోజులివి. ఇప్పుడు సుమిత్ర ఆలోచనల్లోని వార్ధక్యం పూర్తిగా తొలగిపోయి పరువం లోని పడుచుదనపు తియ్యదనాన్ని చవిచూస్తోంది. ■